# విమల

శ్రీమతి ఆదంట సత్యవతమ్మగారు

## ౧

విమలబాల్యము వసంతఋతువువలె సౌఖ్యముగ ఆటపాటలతో గడచెను. ఇఁక యౌవనము – ఇరువదియైదేండ్లదాక వర్షశరత్ప్రకృతివలె నవనవోన్మేషమై, అప్పుడే వికసించిన కుసుమగుచ్ఛమువలె సుందరతరమై, సౌరభోపేతమై, నిర్మలసలిలప్రవాహానుకరణగంభీరమై, ప్రణయినీమృదులమై, అన్యోన్యావలోకానానందరసాస్వాదనధన్యజీవియై వెలసెను. ప్రాణపతీపవిత్రప్రేమామృతధారాభిషేచనచే విమలాజీవితసుమము నయనారవిందమయ్యె.

ఇఁక మూఁడవకాలము సంధ్యాసమయము. అస్తంగితభానుని యుష్ణదీప్తివలెనే విమల ఆశాదీపికచల్లనై, హృదయస్థితకుసుమమందలి ప్రణయదళము లొక్కొక్కటి యూడ జొచ్చెను విమలఅవస్థ ప్రకృతము శిశిరమందలి ఎండుమోడు ననుకరించుచుండెను. నిరాశా సూచకంబగు ముఖమున విషాదచ్ఛాయ లలముకొని, రాహుగ్రస్తభానునివలె కాంతిదొరఁగి యుండెను. విమలాకల్పతరు విరువుర పిల్లలగాంచెను. కాని భర్తానురాగదూరీకృతురాలగుటచే గర్భరత్నములదీప్తి కామోదము లేకుండెను.

విమల అనర్ఘరత్నమనియు, తనపాలిటికామధేనువనియు వచించుపతి తన్ననాదరణ సేయుచుండుటచే, "అతిపరిచయావదజ్ఞ" అను లోకోక్తి సత్యమయ్యెనని తలఁచి ఆమె దుఃఖించుచుండెను. మనోవ్యాధికిమందులేదు. సంతోషముసగముబలము. అసంతృప్తిగల తరుణి అవస్థాకారణమున వృద్ధురాలిననుకరించును

కేశవునికి దుస్సహవాసంబున క్రమముగా జారద్యూతపానంబు లభ్యాసమాయెను. రంభాసదృశసతీరత్న మసహ్యాకరముగను, గృహనివాసము కంటకతల్పమువలెను, పత్నీహితాదరణామృతము విషపానమువలెను తలఁచి ద్వేషింపమొదలిడెను.

త్రాగుట, ఎచ్చటనోపడిపోవుట, మతిలేని సమయంబున జేబులందుండెడి ద్రవ్యము గోల్పోవుట, తెలివిగలిగినతర్వాత యింటికివచ్చి కస్సుబుస్సుధ్వనులతో బొమముడులతో రెండుమెతుకులుకతికి నాన్నాయని చేరవచ్చుబిడ్డలను చీదరించుకొనియు మాటాడబోవు భార్యను రెండుమోదియు నిమిషములమీఁద నిలువెడలిపోవుట జరుగుచుండెను.

ఒకసారి కూఁతును, మనుమలను చూచుటకువచ్చిన విమల తలిదండ్రు లీతనిప్రవర్తనఁ దిలకించి ' రము చింతించి విమలను పుట్టింటికిరమ్మని బ్రతిమాలిరి. కాని సతీరత్నమగు విమల స్త్రీకి నివాసయోగ్యమైన భర్తృస్థానమువిడుచు టనర్హమని, విష్ణువక్షస్థల మాక్రమించిన లక్ష్మిని, పతిజిహ్వానేనిలచిన సరస్వతిని, పతికి అర్థాంగియైయున్న పార్వతిని తార్కాణము జూపి, ఎంతటి కంటకస్థానమైన పతిసహచారిణినై యిచ్చటనేయుండెదను కాని దేహసౌఖ్యమునకాసించి పుట్టినింటనుండి ఆత్మోన్నత్యము చంపుకొననని ఖండితముగాబల్కెను. కూఁతు

సుగుణశీలంబులకాత్మలో ముదమంది, ధర్మమేజయించునని దీవించి విమల జననీజనకు లామెకు సరిపడుడబ్బునొసగి, ఇబ్బందికలుగుతరుణమున మరల జాబువ్రాయుమని వెడలిపోయిరి.

## ౨

ఒకనాడు. పౌర్ణమి. రాత్రిపదుగంటలైనది గోదావరికివరద సంపూర్ణముగావచ్చి గట్టుకు దాసియుండెను. పిల్లలేడ్చుచుండుటచే మంచిగాలిలో త్రిప్పదలచి విమల గట్టుదరినేయున్న తమ యింటినివీడి శిశుద్వయముతో గట్టెక్కెను. ఇంతలో కాలికి బలుబుపదార్థము తగిలి యులికిపడి క్రిందకుచూడ తనభర్తయగు కేశవుడచ్చట అచేతనుడై పడియుండెను. త్రాగుబోతు మితిమీరిత్రాగి ఇంటివైపువచ్చెను. అంతటితో యొడలుమరచి పడియుండవచ్చును. కాని భర్త్రానురాగిణియగు విమల కాతనిస్థితి చూడగనే హృదయము చెదరెను. మతి మతిలోలేదు. నెత్తిలో ఆలోచనలేదు ఏమిచేయవలెనో తోచక చంకబిడ్డను క్రిందద్రింపి ఎడకుర్రనిమరచి, ఉగ్గిలిపట్టున పతిదేహమెత్తి సందిటపట్టి హృదయావేశముగ అబలాత్వముపోవ నతివేగమున ఇల్లుప్రవేశించి మగనిని మంచముపై బరుండపెట్టెను

తలములిగిన ఆపదసమయమున గర్భంతీపిమరచినది గట్టుపై విడచిన బిడ్డలయాలోచనయేచేయక మగనియందే దృష్టినిల్పి శీతలోపచారములు చేయుచున్నది ఏడాక్టరుకైన కబురంపుదమన్న మారుదిక్కులేదు ఇట్టి ఏకాకిదశలో నాసాధ్వి భగవంతునిపై భారము వైచి భర్తనురక్షింప ప్రార్థించుచుండెను

ఇంతలో విమలచేయు నుపచారములచే త్రాగినమత్తును, పడుటలో నెత్తికితగిలిన దెబ్బచే కలిగినదిమ్మును వదలి, మెల్లనకండ్లు తెరచిచూచి దాహమని సంజ్ఞచేసెను. పతిస్మృతియే కావలసినవిమల యాతని సంజ్ఞగుర్తుగ్రహించి తక్షణమే చల్లనిపానీయములాతని నోటపోసెను. దానితో కేశవునకు పూర్ణస్మృతికలిగి తానిచటికెట్లువచ్చితినని ప్రశ్నించెను.

పతిజీవితసంశయవిచ్ఛిన్నహృదయయై విమలకుమతికుదుటబడుటలో బిడ్డలుజ్ఞప్తికి వచ్చి పతిప్రశ్నకు జవాబివ్వకయే శరవేగంబున గట్టెక్కిచూడ ఏమనిచెప్పను? నిమిషమాత్ర మాలసించిన కడుపు గంగాప్రవేశమై పోవలసినదే ప్రాకుచుండిన చంటిబిడ్డఏడ్చుచు నీటిదరికి బోవుచుండెను. ఏకగర్భజనితావ్యాజానురాగ అయాచితభావోదయుడగు ఎడబాలు డాచిన్నిబాలవెంబడినే ఏడ్చుచు, చెల్లెలిని తీయశక్తియు, యుక్తియులేనివాడగుట కూడనేగుచుండెను. సహజసోదరస్నేహమంతటిదే ఇటుల వారిరువురు నీటిసమీపమునకు వచ్చియుండిరి. అట్టి భయానకదృశ్య మవలోకించి విమలకడుపు తరుగుకొనిపోవ ఒక్కదాటునగట్టుదిగి, చేతులతో తపతపకొట్టుచుండిన ఎసినిసుగు నమాంతమున హృదయమున నత్తికొని, పెద్దకుర్రని ఎడమ చంకపెట్టుకొని కనుకొలుకుల వేడికన్నీటిబిందువులచే బిడ్డల మూర్థములు తడుపగ ప్రస్తుత పరిస్థితు లానందదాయకములుగచేసిన పరమేశుని మనమున కీర్తించుచు గృహముజొచ్చెను.

పడుటలో తగిలిన ప్రబలాఘాతముచే కేశవునికి పూర్వజ్ఞానముకలిగి తనవివాహ

మాదిగా విమలచెలిమియు, ఆమె ప్రేమాలాపంబులచేతను లాలింపబడుచుండిన కాలమును, ప్రస్తుత తనదుష్ప్రవర్తనయు, హృదయరత్నమును తనపదముల తన్నుచుండిన తనయవివేకమును, అప్పటికిని తనయందాసతి చూపుచున్న ఆదరణాతిశయానురాగమును గుర్తెరిగి తనదైయున్న వస్తువయొక్క విలువ తెలియని అలుసుతనమునకు పశ్చాత్తప్తమనస్కుఁడై భార్యానురాగము అవస్థాభేదావరణచే కప్పబడినది తొలగి మరల మొలకెత్తెను. "హృదయకుసుమమును చించివేయకుము దాని సౌరభంబాఘ్రాణించుచు శిరమునదాల్చుము! అర్థాంగి కానందదాయివగుము" అని హృదయవీణ పంచతంత్రులమ్రోగుచుండెను. వస్తుతత్త్వమెరిగిన వారికది రెట్టింపువిలువ. ప్రేమస్థిరత్వమగును అట్టి సదవకాశము కేశవునివలన మరల విమలకు కలుగనుండెను

కిశోరద్వయముతో, దరహసితవదనముతో వచ్చుచుండిన గృహలక్ష్మి కాగృహమేధి యెదురేగి బిడ్డల నిరువురనొక్కసారియే అందికొని ముద్దులముంచివేసెను. "ఏదీ నాసతి! ఏదినాజీవితరత్నము. కాలదన్నిన సుమమును కళ్ళనద్దికొనువిలువనిప్పటికెరిగితిని. విమలా! నాతప్పులను మరువవా? నా యనాదరణాగ్నిచే నీహృదయమును కాల్చివేసితిని, క్షమించవా? మునుపటి నీప్రేమామృతముచే నిస్సారమైశుష్కించిన యీయెండుకట్టెను మరలదనిపి చిగురించచేయవా?" అని సంపూర్ణచంద్రకాంతిలో నామెను చేరదీసికొనెను.

పతియొక్క పది అవమానభారముల నొక్క ఆదరణముతో నిజసతిమరువకుండ నుండగలదా? విమలానందనయనముల సొబగాసమయమున వర్ణింప శేషునకైనతరముకాదన కేశవునకువశమా? ప్రేమరెట్టించిన హృదయమునకు కురూపి జగన్మోహినియే.

"అచేతనుఁడనైయుండిన భారమగు నాదేహమెట్లింటకొక్కతెవు మోచికొనివచ్చితివే విమలా!" అనెను కేశవుఁడు

"స్త్రీ శక్తిస్వరూపిణియనియు, సమయానుకూలముగా కుంచితవిజృంభణశక్తులను పొందగలదనియు నెరుగరా? భర్తానురాగము కడుపుతీపినికూడ కొంచెపరచెనుకదా! మీరుండెడి ఆపదస్థితిలో పిల్లలనే వదలివచ్చితినికదా? నమ్మినవారిని చెఱుపడని భగవంతునికి బిరుదు లేనియెడల గోదావరియొడ్డునకుదిగిన పిల్లలు, కనుపుగంగాప్రవేశమై "నదీనాంసాగరోగతి"యై యుండునుకదా!" అనెనువిమల.

ఈ కడపటిమాటలతో హృదయముకలిగి కేశవుఁడు బోరున పసినిసుగువలె ఏడ్చి తన సతీమణినిలాలించి, బిడ్డలనిరువుర మరల ముద్దాడి హృదయవ్యథ తీర్చుకొనెను. అది మొదలు కేశవుఁడు పశ్చాత్తాపాగ్నిచే పాపత్ర్యణరహితుఁడై నాఁడు మొదలు కపోతదంపతుల వలె యెడబాటులేక అన్యోన్యబద్ధులై విమలాకేశవులు కైశోరలీలలంగాంచుచు సుఖజీవితమామరణాంతము గడపిరి. కూతురి సంసారమందలిమార్పున కానందచిత్తులైరి విమల తలిదండ్రులు. విమలకూతురు లీల. లీలలాలింపులచే తదుపరిపుట్టిన తమ్ముఁడాడుకొనుచుండెను.